క్లుప్తంగా

బస్తీ దవాఖాన పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న బస్తీ దవాఖాన పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం బస్తీ దవాఖాన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకున్న సమయంలోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వననర్సరీ పరిశీలన

కథలాపూర్: మండలంలోని దుంపేటలో వన నర్సరీని ఎంపీడీవో జనార్దన్ సోమవారం పరిశీలించారు. హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఈసీ లక్ష్మయ్య, టీఏ అంబాజీ, సర్పంచ్ అంబటి లత ఉన్నారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న గంగరాజు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలోని నివేదిత వృద్ధాశ్రమంలో సోమవారం రామాజీపేట గ్రామానికి చెందిన మంద అశోక్–గంగరాజు దంపతులు వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

పాఠశాల స్థలంలోనే క్రీడాప్రాంగణం



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామపూర్ పాఠశాల స్థలంలోనే క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు తహసీల్దార్ మహేశ్వర్, ఎంపీడీవో ప్రభు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం యామపూర్ శివాలయం వద్ద క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు స్థలాన్ని నిర్ణయించగా ఈ స్థలం వివాదాస్పదంగా మారడంతో పాఠశాల స్థలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు అనువుగా ఉండటంతో పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. అనంతరం గోధూర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండాలో క్రీడా ప్రాంగణ పనులను పరిశీలించి వర్షకొండ, ఇబ్రహీంపట్నంలో మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు. ఎంపీవో కృపాకర్, ఈసీ నవీన్, నాయకులు బొరిగం మహేశ్, తలారి ఆనంద్, పంచాయతీ కార్యదర్శులు రాజన్న, రమేశ్, నిరోష, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ధర్మపురి: పండుగలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని కోరుతూ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం రేషన్ డీలర్లకు బియ్యం పంపించి వారంరోజులు గడుస్తున్నప్పటికీ ఇంకా పంపిణీ ప్రారంభించకపోవడంతో ప్రజలు ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని వెంటనే పంపిణీ ప్రారంభించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం హిందూ పండుగలపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం సరికాదన్నారు. కార్యక్రమంలో బండారి లక్ష్మణ్, కస్తూరి శరత్, బాకీ రాజేశ్, నరెడ్ల శంకర్, నలుమాసు వైకుంఠం, పోగుల గుండయ్య, పల్లెర్ల సురేందర్, కస్తూరి రాజన్న, అప్పం శ్రీనివాస్, సంగి రాజేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడిమ్యాల: మండలంలోని పూడూరు 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల దృష్ట్యా బుధవారం ఉదయం 11 నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ బాలలింగం తెలిపారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని అన్నిగ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

యాసంగి సాగుపై రైతన్న ఆందోళన

- తాళ్లచెరువు ప్రాజెక్టు తూమ్‌కు లీకేజీ.. వృథాగా పోతున్న నీరు
- ప్రాజెక్టు కింద 150 ఎకరాల ఆయకట్టు
- లీకేజీ అరికట్టాలని రైతుల విన్నపం



ప్రాజెక్టు తూము లీకేజీతో వృథాగా పోతున్న నీరు

కథలాపూర్: వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లు చేరడంతో యాసంగి పంటలకు ఢోకా ఉండదని రైతులు భావించారు. కానీ ప్రాజెక్టు తూము నుంచి నీరు లీకేజీ కావడంతో నీరంతా వృథాగా పోతోందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యాసంగి పంటలకు నీరందుతుందో లేదోనని మండలంలోని గంభీర్‌పూర్ తాళ్ల చెరువు ప్రాజెక్టు ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చొరవచూపి ప్రాజెక్టు తూముకు మరమ్మతు చేయించి వృథాగా పోతున్న నీటికి అడ్డుకట్ట వేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

150 ఎకరాల విస్తీర్ణంలో తాళ్లచెరువు ప్రాజెక్టు

మండలంలోని గంభీర్‌పూర్ గ్రామశివారులో తాళ్ల చెరువు ప్రాజెక్టు 150 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో నీళ్లుంటే సుమారు 1,500 ఎకరాల భూములకు నీరందుతుంది. వర్షకాలంలో భారీగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి అధికంగా నీళ్లు చేరాయి. ఇందులో నీళ్ల పుష్కలంగా ఉండటంతో సాగు, తాగునీటికి ఢోకా ఉండదని గ్రామస్తులు పేర్కొన్నారు. మరోవైపు తాళ్లచెరువు ప్రాజెక్టులోకి పుష్కలంగా నీళ్లు చేరితే మండలంలోని గంభీర్‌పూర్, బొమ్మెన, మేడిపెల్లి మండలం ఈదుల లింగంపేట గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని స్థానికులు తెలిపారు.

తూము లీకేజీ.. వృథాగా పోతున్న నీరు

తాళ్లచెరువు ప్రాజెక్టు తూములో నుంచి నీళ్లు కొన్నినెలలుగా లీకేజీ అవుతున్నాయని రైతులు తెలిపారు. తూము గేట్ సరిగా లేకపోవడంతో అందులో నుంచి నీళ్లు వృథాగా పోతున్నాయన్నారు. కొన్నిరోజులు పరిస్థితి ఇలా ఉంటే ప్రాజెక్టులో నీళ్లు అడుగంటిపోయే ప్రమాదముందని ఆయకట్టు రైతులు ఆంశన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టును నమ్ముకొని తాము సాగు చేస్తున్న పంటలు ఎండిపోయే దుస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. అధికారులు చొరవ చూపి ప్రాజెక్టులోని నీళ్లు వృథా పోకుండా వీలైనంత తర్వరగా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నీరు వృథా పోతోంది



తాళ్ల చెరువు ప్రాజెక్టు తూము లీకేజీతో నీళ్లు వృథాగా పోతున్నాయి. ప్రాజెక్టులో నీళ్లు అడుగంటితే యాసంగి పంటలకు నీళ్లు అందడం కష్టం. అధికారులు చొరవ చూపి ప్రాజెక్టు తూము లీకేజీకి మరమ్మతు చేయించాలి.

– కాల్వ సత్యనారాయణ, రైతు, గంభీర్‌పూర్

జాప్యం చేయొద్దు



తాళ్లచెరువు ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లుంటే బొమ్మెన, ఈదుల లింగంపేట, గంభీర్‌పూర్ బోరుబావుల్లో నీళ్లుంటాయి. తూము లీకేజీతో నీళ్లు వృథాగా పోతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి జాప్యం చేయకుండా మరమ్మతు చేయించాలి.

– జలంధర్‌రెడ్డి, రైతు, బొమ్మెన

చర్యలు తీసుకుంటాం



తాళ్లచెరువు ప్రాజెక్టు తూము లీకేజీతో నీళ్లు వృథాగా పోతున్న విషయం తెలిసింది. ప్రాజెక్టును పరిశీలించి లీకేజీనిపరిశీలిస్తాం. తూము లీకేజీలను త్వరగా మరమ్మతు చేయించేలా చర్యలు తీసుకుంటాం.

– రవికుమార్, నీటిపారుదలశాఖ, డీఈ, వేములవాడ

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ సంస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కోరుట్ల డిపో నుంచి హైదరాబాద్ నడిపించేందుకు వచ్చిన కొత్త బస్సును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. కోరుట్ల, మెట్‌పల్లి డిపోలు ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, లాభాల బాటలో నడవడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, వైస్‌చైర్మన్ గడ్డమీది పవన్, ఎంపీపీ తోట నారాయణ, ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీ ప్రసూన, నాయకులు, కౌన్సిల్ సభ్యులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్‌లో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ గోదామును ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సోమవారం ప్రారంభించారు. జోగిన్‌పెల్లి గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. మాదాపూర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో అధ్యక్షుడు పాల్గొన్నారు.

‘మున్సిపల్ చైర్‌పర్సన్ ఎమ్మెల్సీకి క్షమాపణ చెప్పాలి’



మాట్లాడుతున్న విజయలక్ష్మి

జగిత్యాల: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఎమ్మెల్సీకి చైర్‌పర్సన్ క్షమాపణ చెప్పాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఇందిరాభవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతులు భూములపై హక్కులు కోల్పోకుండా ముందుచూపుతో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తే విమర్శిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్‌ను పట్టణంలోనే అమలు చేయాలని కోరారు. యావర్‌రోడ్డును విస్తరించేందుకు చొరవ చూపడం లేదని, నాలుగేళ్లయినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మాస్టర్ ప్లాన్ అమలుకు కొన్ని గ్రామపంచాయతీలు తీర్మానాలు ఇచ్చాయని మున్సిపల్ చైర్‌పర్సన్ చెప్పడంతో గ్రామాల సర్పంచులు ఆందోళన చెంది ప్రజావాణికి తరలివస్తున్నారన్నారు. రైతుల పక్షాన ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారని, దానిని విమర్శ అనడం తగదన్నారు. మాస్టర్‌ప్లాన్‌లోని తిప్పన్నపేట, నర్సింగాపూర్, కండ్లపల్లి, తిమ్మాపూర్, హస్నాబాద్, లింగంపేట గ్రామాల్లో ఇండస్ట్రియల్, రిక్రియేషన్ జోన్లు తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగభూషణం, బండ శంకర్, కండ్లపల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, నక్క జీవన్, రమ్య, సిరాజోద్దీన్ మన్సూర్, రమేశ్‌బాబు, గుండ మధు పాల్గొన్నారు.

మల్యాలలో జోరుగా వరిసాగు



మల్యాలలో రైతులు సాగుచేసిన వరిపొలాలు

- సుమారు 12,300 ఎకరాల్లో సాగు

మల్యాల: మండలంలో వరిసాగు జోరుగా సాగుతోంది. ఇప్పటికే 80శాతం మంది రైతులు నాట్లు వేశారు. మండలంలో 22,500 ఎకరాల సాగుభూమి ఉండగా, మామిడితోటలు 4,600, వరిసాగు 12,300, పత్తి 700 ఎకరాలు, పసుపు 300, నువ్వులు 300 ఎకరాల్లో సాగు చేయగా, మిగిలిన ఎకరాల్లో పెసర, కంది, అనుము సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలో తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, లంబాడిపల్లి, తాటిపల్లి గ్రామాలకు సాగునీటికి ఎస్సారెస్పీ ఆయకట్టు భరోసానిస్తుండగా, రాంపూర్, ఒబులాపూర్, రామన్నపేట, గొల్లపల్లి, మద్దుట్ల, నూకపల్లి, ముత్యంపేట, సర్వాపూర్ గ్రామాల్లో వరదకాలువ ద్వారా రైతులు సాగు చేస్తున్నారు. మండలంలోని చెరువులు, వ్యవసాయ బావుల్లో నీరు పుష్కలంగా లభిస్తుండడంతోపాటు ఎస్సారెస్పీ కాలువ, వరదకాలువలో నీరు అందుబాటులో ఉండడంతో రైతులు ముందస్తుగానే వరినాట్లు వేస్తున్నారు.

క్లుప్తంగా..

◆ రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మల్యాల: యాసంగి వరిపైర్లలో కాండం తొలుచు పురుగు, రెక్కల పురుగు, గుడ్ల సముదాయాలు కనపడుతున్నాయని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మల్యాల మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ సూచించారు. గత రెండేళ్లతో పోల్చితే ఈ ఏడాది పిలక దశలో కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు.

◆ దుబ్బరాజన్న ఆలయంలో వేలం వాయిదా

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ వస్తువుల అమ్మకం, సేవలకు సోమవారం నిర్వహించిన బహిరంగ వేలం వాయిదా పడింది. గత సంవత్సరం కంటే తక్కువ మొత్తంలో పాటదారులు వేలం పాడడంతో వేలం వాయిదా వేస్తున్నట్లుఈవో కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త శంకరయ్య తెలిపారు.

◆ ఏఎన్‌ఎం ఉద్యోగానికి దరఖాస్తులు

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలంలోని కండ్లపల్లి మోడల్ పాఠశాలలోని బాలికల హాస్టల్‌లో ఏఎన్ఎం పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జగిత్యాలరూరల్ మండల విద్యాధికారి గాయత్రి తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 12లోపు దరఖాస్తుదారులు కండ్లపల్లి బాలికల హాస్టల్‌లో సమర్పించాలన్నారు. వివరాలకు కండ్లపల్లి హాస్టల్ ప్రత్యేకాధికారి 85220 80903 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

◆ మధుసూదన్‌రెడ్డికి సన్మానం

జగిత్యాలజోన్: జగిత్యాలకు చెందిన న్యాయవాది నాగిరెడ్డి మధుసూధన్‌రెడ్డి గణేశ్‌నగర్ సంక్షేమ మండలి అధ్యక్షుడిగా రెండోసారి గెలుపొందిన సందర్భంగా బార్ అసోసియేషన్ న్యాయవాదులు సన్మానించారు. న్యాయవాదులు ప్రతాప్, ఓం ప్రకాశ్, సురేందర్, మదన్‌మోహన్, రాంచంద్రం, సతీశ్, మురళి, కిషన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, గంగారెడ్డి, లక్ష్మారెడ్డి, చంద్రమోహన్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ నూతన నియామకం

పెగడపల్లి: గొల్లపల్లి మండలంలోని తిరుమలాపూర్ గ్రామశాఖ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా గాదె నందయ్య ఎన్నికయ్యారు. ఆ సంఘం ఎన్నికలు సోమవారం జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా బైన తిరుపతి, ఉపాధ్యక్షుడిగా తాటిపండు రవి, కోశాధికారిగా జుట్టు వినయ్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా గాదె ఆంజనేయులు, బైన లక్ష్మణ్, లక్కం చంద్రయ్య, పూరెల్ల రాజయ్య, చిత్తరి గోపాల్, కల్లెం తిరుపతి, ఉత్కం లచ్చయ్య, జగుడం రమేశ్, జగుడం లచ్చయ్య ఎన్నికయ్యారు.

◆ దుకాణాలకు వేలం

రాయికల్: పట్టణంలోని హనుమాన్ ఆలయానికి చెందిన ఆరు దుకాణాలను సోమవారం వేలం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ ఎలగందుల సత్యనారాయణ తెలిపారు. మూడేళ్ల కాలపరిమితి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోర హన్మండ్లు, పరిశీలకులు రంగు రవికిషన్, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, ఈవో విక్రమ్ పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న సీడీపీవో తిరుమలదేవి

కథలాపూర్: అప్పుడే పుట్టిన పిల్లలకు ఆరునెలల వరకు తల్లిపాలు అందేలా చూసి వారి సంరక్షణపై ప్రత్యేక దృష్టిసారించాలని మెట్‌పల్లి సీడీపీవో తిరుమలదేవి సూచించారు. ఈ మేరకు సోమవారం కథలాపూర్ మండలకేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు, ఆశా కార్యకర్తలకు నవజాత శిశువుల సంరక్షణ, అదనపు పోషకాహారం అందించడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల్లో రక్తహీనతను అధిగమించేలా వారికి సలహాలు ఇవ్వాలన్నారు. అనారోగ్యంతో ఉన్న చిన్నారులను గుర్తించి వారికి సరైన సమయంలో అదనపు పోషకాహారం అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, అరుణ, పీహెచ్ఎన్ పార్వతి, కోఆర్డినేటర్ మహేందర్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదం జరిగితే కానీ పట్టించుకోరా?

బుగ్గారం: పట్టణంలోని మార్కెట్‌యార్డు రహదారిలో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం ఈమార్గంలో నూతనంగా సీసీరోడ్డు వేయడంతో ట్రాన్స్‌ఫార్మర్ గద్దె లోతులో కూరుకుపోయింది. దీంతో రోడ్డుకు సమాన ఎత్తులో ఉండి ప్రమాదకరంగా మారింది. విద్యుత్ వైర్లు చిన్నపిల్లలకు సైతం అందేలా ఉన్నాయి. సమీపంలోని ఇళ్లలో ఉంటున్న వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలోని పలువురు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను తమకు అనుకూలమైన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని సమీప రైతులు చాలాకాలం నుంచి కోరుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను తక్షణమే పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: మనోహర్, ఏఈ, ధర్మపురి

ఫోన్ నంబర్: 94408 11469

వైద్యరంగంలో ప్రధానపాత్ర అనస్తీషియాలదే



నూతన కార్యవర్గంతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: వైద్యరంగంలో ప్రధానపాత్ర పోషించేది అనస్తీషియా వైద్యులని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పీఎంఆర్‌లో నిర్వహించిన జగిత్యాల సొసైటీ ఆఫ్ అనస్తీషియాలజిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనస్తీషియా వైద్యులు ఆపరేషన్ నిర్వహించే సమయాల్లో అనుక్షణం అప్రమత్తంగా ఉంటారనీ, వైద్యవృత్తితో పాటుగా సామాజిక సేవవైపు కూడా దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్తీషియాలజిస్ట్స్ జాతీయ అధ్యక్షుడు డా.భీమేశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు డా.రత్నాకర్ పాల్గొన్నారు.

అనస్తీషియాలజిస్ట్స్ అధ్యక్షుడిగా నాగరాజు..

జగిత్యాల సొసైటీ ఆఫ్ అనస్తీషియాలజిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డా.పి.నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా డా.కె.సుధీర్‌కుమార్, అలాగే ఉపాధ్యక్షుడిగా డా.వి.రామకృష్ణ, డా.కె.జగదీశ్వర్, జాయింట్ సెక్రటరీగా టి.కళ్యాణచక్రవర్తి, డా.జి.రవి, కోశాధికారిగా డా.బి.శంకర్, కార్యనిర్వాహక సభ్యుడిగా డా.జి.శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

ట్యాంక్‌బండ్ పనులు వెంటనే పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న నాయకులు

మెట్‌పల్లి: పట్టణంలోని పెద్ద చెరువు వద్ద చేపట్టిన మినీ ట్యాంక్‌బండ్ పనులను పూర్తి చేయకుంటే ఆందోళన చేస్తామని పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం అన్నారు. ఈ మేరకు సోమవారం ట్యాంక్‌బండ్ పనులను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2.80కోట్లతో మూడేళ్ల క్రితం చేపట్టిన ఈ పనులను ఇంతవరకు పూర్తి చేయకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. మిగిలిన పనులను పూర్తి చేయించడంలో ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, నాయకులు ముఖీం, కంబ శంకర్, నర్సయ్య పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. వెంకన్నస్వామి దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

కోరుట్లటౌన్: పట్టణంలోని పురాతన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. వెంకన్నస్వామికి ఆదివారం రాత్రి దీపోత్సవం కార్యక్రమం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి విక్రమ్, సహాయక అధికారి పెడివెల్లి నర్సయ్య, పూజారి బీర్నంది నరసింహాచారి, ఆండాళ్ బృందం పాల్గొన్నారు.

ఉద్యోగుల శ్రేయస్సు కోసం పనిచేయాలి



సన్మానిస్తున్న జిల్లా నాయకులు

జగిత్యాల: టీఎన్జీవో సంఘం ఉద్యోగుల శ్రేయస్సు కోసం పనిచేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మామిండ్ల రాజేందర్ కోరారు. ఈ మేరకు సోమవారం జగిత్యాల జిల్లాశాఖ నాయకులు రాజేందర్‌ను హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, జిల్లా కార్యదర్శి నాగేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు, అమరేందర్‌రెడ్డి, సాహెద్‌బాబు, రవిచంద్ర, రవీందర్, మధుకర్ పాల్గొన్నారు.